# నమస్తే తెలంగాణ

## ములుగు
## జయశంకర్ భూపాలపల్లి

5 | సోమవారం 8 జనవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి
- బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పిలుపు

పాలకుర్తి రూరల్, జనవరి 7: వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తం కావాలని, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించి ఎండగట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఈ విషయంలో నాయకులు అధైర్య పడొద్దని సూచించారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను త్వరితగతిన అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిధుల కొరత పేర జాప్యం చేస్తే ఊరుకోమన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల విషయంలో ప్రజల నుంచి వస్తున్న అభిప్రాయాలపై ఆరా తీశారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ఏదో ఒక విధంగా హామీల అమలును దాట వేసేలా ప్రభుత్వం యోచిస్తోందని ఎర్రబెల్లి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని, ఖజానా ఖాళీగా ఉందని ఆరోపణలు చేస్తూ హామీల అమలును వాయిదా వేసేందుకు సాకులు చెబుతోందని ఆయన విమర్శించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించామన్నారు. రైతు సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా వంటి అద్భుతమైన పథకాలు అమలు చేశామని తెలిపారు. పౌరసరఫరాలు, విద్యుత్ శాఖల్లో అప్పులు పెరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో సంపదను పెంచామనే విషయాన్ని గుర్తించడంలేదన్నారు. రిజర్వుబ్యాంక్ నిబంధనలకు లోబడి అప్పులు తెచ్చామని ఆయన గుర్తు చేశారు. పాలకుర్తి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల మేరకు వివిధ శాఖల్లో అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, వీటి పూర్తికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎర్రబెల్లి కోరారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, నాయకులు పాము శ్రీనివాస్, కాటబత్తిని రమేశ్, లకావత్ సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.



కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి



కల్యాణం జరుపుతున్న అర్చకులు

# కల్యాణం.. వైభోగం

- అంగరంగ వైభవంగా కొమురవెల్లి మల్లన్న లగ్గం
- మార్మోగిన శైవక్షేత్రం
- రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ
- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి.. ఆకట్టుకున్న కార్యక్రమాలు

సిద్దిపేట ప్రతినిధి/ చేర్యాల, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : మేళతాళాలు.. మంగళవాయిద్యాలు.. భక్తుల జయజయధ్వానాల మధ్య కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆదివారం సిద్దిపేట జిల్లా మల్లన్న క్షేత్రంలోని తోట బావి కల్యాణ వేదిక వద్ద లగ్గం జరిగింది. కల్యాణాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణోత్సవంలో స్వామి వారి తరపున పడిగన్నగారి మల్లికార్జున్ దంపతులు, అమ్మవార్ల తరపున మహాదేవుని మనోహర్ దంపతులు పాల్గొన్నారు. అమ్మవారి తరపున మహాదేవుని సాంబయ్య, స్వామి వారి తరపున పడిగన్నగారి మల్లయ్య దంపతులు పాల్గొని కల్యాణ తంతు నిర్వహించారు. ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి.. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి సమర్పించారు.

## కనులపండువగా..

స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం మార్గశిర మాసం ఏకాదశి ఉదయం 10.45 గంటలకు నిర్వహించాల్సిన కల్యాణం ఆలస్యంగా జరిగింది. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోటబావి వద్ద నిర్మించిన కల్యాణ వేదిక వద్ద స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అంతకుముందు ఊరేగింపుగా వెళ్లి స్వామివారి తరపున మహాదేవుని వంశస్తులు, పడిగన్నగారి వంశస్తులు కూర్చుని కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి తాళి, మట్టెలు, ఒడి బియ్యం, బట్టలు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు.

## మల్లన్నకు తగ్గిన కట్నాలు..

గతేడాది జరిగిన కల్యాణోత్సవం సందర్భంగా మల్లన్నస్వామికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రూ.5లక్షలకు పైగా కట్నాలు సమర్పించుకున్నారు. కానీ, ఈసారి కల్యాణోత్సవం సందర్భంగా మంత్రులు కొండా సురేఖ రూ.5116, పొన్నం ప్రభాకర్ రూ.5116, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.5116, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రూ.5116, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.5,116, కొండా సురేఖ కుమార్తె సుష్మితాపటేల్ రూ.21,116తో పాటు మరికొందరు వీఐపీలు చదివించిన కట్నాలు రూ. లక్షలోపే కావడం గమనార్హం.



కల్యాణానికి హాజరైన ప్రజాప్రతినిధులు తదితరులు





స్వామి వారిని కల్యాణోత్సవానికి ఊరేగింపుగా తీసుకుపోతున్న ఆలయ అర్చకులు



సమ్మక్క దర్శనానికి వెళ్తున్న భక్తులు

# మేడారంలో భక్తుల రద్దీ

- ఆదివారం కావడంతో భారీగా రాక
- తల్లులకు బెల్లం సమర్పించి మొక్కుల చెల్లింపు

మేడారం సమ్మక్క-సారలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మొదట భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి సమ్మక్క, సారక్క, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సెలవు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు రావడంతో గద్దెల ప్రాంగణం రద్దీగా మారింది. -తాడ్వాయి, జనవరి 7

*ప్రత్యామ్నాయంపై దృష్టిపెట్టిన రైతులు ప్రయోగాత్మకంగా సాగుచేసిన ఆయిల్‌పాం పంట కాతకు వచ్చింది. మూడేళ్ల క్రితం ఎన్నో ఆశలతో నాటిన మొక్కలు పెద్దవై దిగుబడి మొదలవడంతో రైతుల్లో సంతోషం వెల్లివిరిసింది. గత కేసీఆర్ సర్కారు ప్రోత్సాహం, సబ్సిడీ అందించడంతో జిల్లాలో మొదటి విడుత 352.55 ఎకరాల్లో పంట సాగుచేయగా, ఇప్పటివరకు 3044 ఎకరాల్లో పంట సాగవుతోంది. అంతేగాక ఆయిల్‌పాం తోటల మధ్యలో అంతర పంటలతోనూ అదనపు ఆదాయం పొందుతూ లాభాల పంటలు పండిస్తున్నారు.*

*- జయశంకర్ భూపాలపల్లి, జనవరి 7(నమస్తే తెలంగాణ)*



గుంటూరుపల్లిలో ఆయిల్‌పాం మొక్కలకు వేసిన గెలలు

# ఆయిల్‌పాం పంట కాత వచ్చెనంట..

## జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదలైన దిగుబడి

- తొలి విడుతలో వేసిన 352.55 ఎకరాల్లో క్రాప్ ప్రారంభం
- మొత్తం 3044 ఎకరాల్లో సాగు
- మూడేళ్ల క్రితం వేసిన రైతులు
- ప్రత్యామ్నాయ పంట వైపు 995మంది రైతులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మూడేళ్ల క్రితం నాటిన ఆయిల్‌పాం మొక్కల నుంచి దిగుబడి ప్రారంభమైంది. కేసీఆర్ ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుపై ప్రత్యేక దృష్టిసారించి రైతులకు సబ్సిడీలు అందించి ప్రోత్సహించింది. ఈక్రమంలో రైతులు ఆయిల్‌పాం సాగువైపు అధిక సంఖ్యలో మొగ్గు చూపారు. జిల్లాకు చెందిన 995 మంది రైతులు 3044 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు ప్రారంభించారు. సంబంధిత అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటూ ఆయిల్‌పాం సాగులో ముందుకుసాగారు. మొత్తం 3044 ఎకరాల్లో సాగు చేస్తుండగా మొదటి విడుత సాగుచేసిన 352.55 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కల నుంచి దిగుబడి ప్రారంభమైంది. మొక్కల నుంచి తొలిసారి వచ్చిన క్రాప్‌ను చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 40ఏళ్ల పాటు ఆయిల్‌పాం నుంచి ఇక వరుసగా దిగుబడి రానుంది. ఆయిల్‌పాం తోటల్లో మధ్య మధ్యలో అంతర పంటలు వేస్తూ రైతులు లాభాలు పొందుతున్నారు.

### 352.55 ఎకరాల్లో క్రాప్ ప్రారంభం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 11 మండలాల్లో 10 మండలాలకు చెందిన 112మంది రైతులు 2021-22లో మొదటి విడుత 352.55 ఎకరాల్లో ఆయిల్ పాం మొక్కలు నాటగా ప్రస్తుతం దిగుబడి ప్రారంభమైంది. భూపాలపల్లి మండలంలో 42.10 ఎకరాలు, చిట్యాల మండలంలో 75.35 ఎకరాలు, గణపురం మండలంలో 16.60 ఎకరాలు, మొగుళ్లపల్లి మండలంలో 77.43 ఎకరాలు, రేగొండ మండలంలో 73.05 ఎకరాలు, టేకుమట్ల మండలంలో 14.58 ఎకరాలు, కాటారం మండలంలో 5.38 ఎకరాలు, మహాముత్తారం మండలంలో 37.63 ఎకరాలు, మల్హర్ మండలంలో 10.43 ఎకరాల్లో మొదటి విడుత వేయగా పంట దిగుబడి మొదలైంది.

### జిల్లాలో 3,044 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 2021-22 నుంచి 2023-24 వరకు 3044 ఎకరాల్లో 995మంది రైతులు ఆయిల్ పాం సాగు చేశారు. ఇందులో మొదటి విడుత 2021-22 లో 112మంది రైతులు 352.55 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. అలాగే 2022-23లో 609మంది రైతులు 1877.53 ఎకరాల్లో, 2023-24లో 274 మంది రైతులు 841 ఎకరాల్లో సాగుచేశారు. మొత్తం 3044 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు జోరుగా సాగుతుండగా ఇంకా ఆయిల్‌పాం సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. పంట ప్రారంభంలో మొక్కలతో పాటు డ్రిప్‌కు కేసీఆర్ ప్రభుత్వం సబ్సిడీ అందించింది. పంట వేసిన మొదటి సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి రూ.4200 సబ్సిడీ అందిస్తారు. ఒక్కో మొక్కకు రూ.223 ఉండగా రూ.193 సబ్సిడీ అందించారు. ఎకరానికి ప్రారంభంలో 3 నుంచి 4 టన్నుల దిగుబడి రానున్నది. అలాగే 5 నుంచి 7 ఏళ్లు దాటితే 10 టన్నుల దిగుబడి రానున్నది. ఒక టన్నుకు మార్కెట్లో రూ.12వేలు ధర పలుకుతుంది. ఈక్రమంలో పంట ఒక్కసారి వేస్తే 40 ఏళ్ల పాటు నికర ఆదాయం పొందనున్నారు.



గుంటూరుపల్లిలో ఆయిల్‌పాం తోటలు

### లాభసాటి పంట

వరి, మిర్చికి ఇది ప్రత్యామ్నాయ పంట. వరి, మిర్చి ఇతర పంటల్లాగా దీనికి భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. ఒక్కసారి నాటి సస్యరక్షణ చర్యలు చేసుకుంటూ పోతే 40 ఏళ్లకు పైగా దిగుబడి పొందవచ్చు. నేను మూడెకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటాను. అంతకుముందు భూమిని పెట్టుబడి పెట్టలేక పడావు పెట్టాను. అధికారుల సూచన మేరకు ఆయిల్ పాం సాగు మొదలు పెట్టాను. మొన్ననే మొదటి క్రాప్ వచ్చింది. అయితే తొలిసారి క్రాప్ కావడంతో విక్రయించలేదు. రెండవ క్రాప్‌కు చెట్లను సిద్ధం చేశాను. రైతులు వరికి, మిర్చికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పాంను ఎంచుకోవాలి. మార్కెట్‌లో ధర ఎంత తగ్గినా నష్టమైతే ఉండదు. 40 ఏళ్ల పాటు ప్రశాంతంగా జీవించవచ్చు.

- పువ్వాటి సత్యనారాయణరావు, గుంటూరుపల్లి, చిట్యాల మండలం



# కాంగ్రెస్‌వి కక్ష సాధింపు చర్యలు

- ప్రజా సంక్షేమంపై ఆంక్షలా?
- రూ. 300 కోట్ల అభివృద్ధి పనుల రద్దు సరికాదు
- సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజల పక్షాన ఉద్యమిస్తాం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 7 : నర్సంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన రూ. 300 కోట్ల అభివృద్ధి పనులను రద్దు చేసి కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడారు. నియోజకవర్గంలో రోడ్లు, చెక్‌డ్యామ్‌లు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, బీటీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, వీవో భవనాలు, బ్రిడ్జీలు తదితర పనులకు, దళితబంధు, బీసీబంధు, ఇళ్ల నిర్మాణాలకు జీవోలు తీసుకొచ్చి నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కలెక్టర్ ఖాతాల్లో నిధులు కూడా జమ చేసిందన్నారు. కొన్ని పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. మరికొన్ని పనులు మధ్యలో ఉన్నట్లు వెల్లడించారు. వీటన్నింటినీ ఆపాలని కాంగ్రెస్ సర్కారు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. నర్సంపేట డివిజన్‌లో దళితబంధు 1100, బీసీ బంధు 289 మందికి చెక్కులు వచ్చి ఉన్నట్లు స్పష్టం చేశారు. గృహలక్ష్మి పథకంలో 2783 మందికి రూ. 3 లక్షల చొప్పున మంజూరు పత్రాలు అందజేశామన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఇళ్ల నిర్మాణాలను ఆపాలని ఏకపక్షంగా జీవోలు తెచ్చిందని ఎద్దేవా చేశారు.

### అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్

ఎస్‌డీఎఫ్ గ్రాంటు కింద జీవోలు 369, 384, 452, 822 ద్వారా రూ. 44 కోట్లతో కల్వర్టులు, మసీదులు, చర్చీల మరమ్మతులను రద్దు చేసి లబ్ధిదారుల నోట్లో మట్టి కొట్టిందని పెద్ది ఆవేదన వ్యక్తం చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ నుంచి 242, ఆర్అండ్‌బీ నుంచి 260, పీఆర్ నుంచి 517 జీవో ద్వారా సీసీ, తారురోడ్లకు సంబంధించి రూ. 113 కోట్ల పనులను ఆపాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సంపేటకు పైలట్ ప్రాజెక్టు కింద రూ. 75 కోట్లు వెచ్చించి సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించడానికి జీవోను తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే రూ. 16కోట్ల నిధులు ఖర్చయ్యాయని, మిగిలిన రూ. 59 కోట్ల నిధులు వెనక్కి పోవడం దురదృష్టకరమన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేస్తే ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామని పెద్ది కాంగ్రెస్ సర్కారును హెచ్చరించారు. సమావేశంలో వరంగల్ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, నల్లా మనోహర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు నామాల సత్యనారాయణ, బానోత్ సారంగపాణి, సుకినె రాజేశ్వర్‌రావు, సంగని సూరయ్య, తిరుపతి, బాల్నె వెంకన్న, బండి రమేశ్, ఎంపీపీలు వేములపెల్లి ప్రకాశ్‌రావు, రమేశ్, సునీత, పద్మనాభరెడ్డి, జడ్పీటీసీలు బానోత్ పత్తినాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

# అనారోగ్యంతో తమ్ముడు.. గుండెపోటుతో అక్క

- ఒకేసారి ఇద్దరు మృత్యువాత
- పర్వతగిరి గ్రామంలో ఘటన

మహబూబాబాద్ రూరల్, జనవరి 7: అనారోగ్యంతో తమ్ముడు మృతి చెందగా, తట్టుకోలేక అక్క గుండెపోటుతో మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన ఎండీ ఇబ్రహీం(72) అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. తమ్ముడు మృతదేహాన్ని చూసి షేక్ మోదిన్ బీ(76) బోరున విలపించి గుండెనొప్పితో ఒక్కసారిగా కింద పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. రాత్రి మోదిన్ బీ మృతి చెందింది. ఒకే రోజు అక్క, తమ్ముడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.